క్లుప్తంగా

'బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సురక్షితమైంది'



జనగామ రూరల్: బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అత్యంత సురక్షితమైందని, ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఏజీఎం దయాకర్ అన్నారు. వినియోగదారుల సర్వీసు మాసోత్సవంలో భాగంగా శనివారం జిల్లా పరిధిలోని వినియోగదారులకు పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వీస్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సిబ్బంది ఏలేందర్, రామచందర్, శరత్, రమేష్, శ్రీనివాస్, కిరణ్, ఉప్పలయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

ఒంటరిగా తిరగొద్దు



ఎలుగుబంటి సంచార ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇజాజ్‌అహ్మద్

నర్మెట: హన్మంతాపూర్ గ్రామస్తులు ఉదయం, సాయంత్రం వేళలో ఒంటరిగా తిరగరాదని రఘునాథపల్లి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ఇజాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గ్రామంలో ఎలుగుబంటి సంచార ప్రదేశాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచారం చేస్తున్నదని ఏదైనా తప్పని సరి పని అయితే గుంపులుగా వెళ్లాలని అన్నారు. ఫారెస్ట్ బీట్ అధికారి రమేష్ నాయక్, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ పాల్గొన్నారు.

అన్ని రకాల ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

జనగామ రూరల్: వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొస్తున్న అన్ని రకాల ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందు కోరారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమలో రాజు, బీరయ్య, మీట్యా పాల్గొన్నారు.

'బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి'



జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చేసిన అనంతరం పశ్చిమ బెంగాల్‌లో అల్లర్లు, హిందువులపై దాడులను పెరిగాయనని తక్షణమే అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మోహన్‌కృష్ణ బార్గవ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీశైలం, నారాయణ, కోశాధికారి నర్సింహారావు, పట్టణ అధ్యక్షుడు బాలరాజు, సభ్యులు ఉన్నారు.

నివాళి



లింగాలఘణపురం: కిష్టగూడెంకు చెందిన ఓ దిన పత్రిక విలేకరి మార్తాల నర్సింగరావు ఆయన తండ్రి మార్తాల సోమాజీ (85) అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, స్థానిక నాయకులు రాంబాబు, బిట్ల బాబు ఉన్నారు.

దడువాయికి..



జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో దాడువాయిగా పని చేస్తున జూకంటి మనీష్(32) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, శనివారం ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మనీష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ సూపర్ వైజర్ శ్రీనివాస్, దాడువాయి సోమయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రకాశ్ యాదవ్, నాయకులు బూరెల్లి సిద్దులు, శ్రీశైలం, మల్లేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలవాలిన వరి, రాలిన మామిడి కాయలు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- ఐకేపీ సెంటర్‌లో కొట్టుకు పోయిన ధాన్యం
- మహిళా రైతుకు తీవ్ర గాయాలు

జనగామ/సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో శనివారం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి తోటల్లో కాయలు, వరి పంటలు నేలకొరిగాయి. చేతికందిన పంట గాలివానతో అతలాకుతలం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసి పోయాయి. పలు చోట్ల చెట్లు నేలకూలాయి, విద్యుత్‌స్తంబాలు విరిగి పడ్డాయి, ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. అధికారులు రహదారిపై విరిగిపడ్డ చెట్లను తొలగించి విద్యుత్ స్తంభాలను సరిచేయించారు. కాగా, జనగామ వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన చీటకోడూరు ఐకేపీ సెంటర్‌లో ఈదురుగాలులు, అకాల వర్షంతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసి పోయింది. ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా వచ్చిన వరదతో కొంతమేర గింజలు కొట్టుకుపోయాయి. ఈదురు గాలులు మొదలవ్వగానే ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఆర్డీఓ గోపిరామ్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేంద్ర కాటన్ యార్డుకు చేరుకున్నారు. రైతులను అలర్టు చేసి సుమారు 25వేల బస్తాలకు పైగా ఆరబోసిన ధాన్యాన్ని ఒక్కచోటకు చేర్చుకోవాలని సూచించారు. రైతులు ధాన్యం కుప్పలు చేసి, కవర్లు కప్పే సమ యంలో భారీగాలులు, చిన్న పాటి వర్షం మొదలు కావడంతో అవి కాస్తా కొట్టుకు పోయాయి. అతి కష్టం మీద టార్పాలిన్లు కప్పి, ధాన్యం తడిసి పోకుండా అష్టకష్టాలు పడ్డారు. అయినప్పటికీ సగంమేర సరుకు తడిసి పోగా, పలువురు రైతులకు చెందిన గింజలు వరద పాలయ్యాయి. వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులతో నష్టపోతున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.



జనగామ: తడిసిన ధాన్యాన్ని ఒకచోటికి చేరుస్తున్న మహిళా రైతు



తరిగొప్పుల: మండలకేంద్రంలో విరిగిపడిన చెట్టు



బచ్చన్నపేట: రాలిన మామిడి కాయలు

మహిళా రైతు.. తీవ్ర గాయాలు

జనగామ మండలం గానుగుపహాడ్ శివారు గోవింద్ తండాకు చెందిన గుగులోత్ మహేందర్, భార్య సంగీత ధాన్యాన్ని అమ్ముకునేందుకు కాటన్ యార్డులోని ఐకేపీ సెంటర్‌కు వచ్చారు. ఒక్క సారిగా వచ్చిన ఈదురు గాలులతో ఓ టారాల్పిన్ కవర్ ఎగిరి వచ్చి ఆమెపై పడడంతో వెనక్కి పడింది. తలకు గాయం కావడంతో ఫిట్స్ వచ్చి కుప్పకూలింది. వెంటనే మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్ స్పందించి తన వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత, మెరుగైన వైద్య పరీక్షల కోసం హనుమకొండకు తరలించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితులపై శివరాజ్ డాక్టర్లకు ఫోన్ చేసి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్ పరిధిలోని మూడు కవర్ షెడ్లు, కల్లంలో ఉన్న ధాన్యం కొంతమేర తడిసి పోగా, రైతులు టార్పాలిన్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు.



జనగామ: గాలికి ఎగిరి పోతున్న టార్పాలిన్



జనగామ: గాయపడ్డ రైతును ఏఎంసీ చైర్మన్ వాహనంలో తరలిస్తున్న రైతులు



మరిగడిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



రఘునాథపల్లి: నేలవాలిన వరిపంట



చిల్పూరు: ఫతేపూర్‌లో నేలవారిన వరి

సర్కారు బడిలో అక్కా,చెల్లెల్లు ఆదర్శం

- 2024-25లో 100 శాతం ఉత్తీర్ణత
- ఇద్దరు విద్యార్థినులను సత్కరించిన టీచర్లు

జనగామ: చదువులో మేటిగా రాణిస్తూ.. వంద శాతం ఉత్తీర్ణతతో సర్కారు బడుల ప్రతిష్టను ఇనుమడింప జేస్తున్నారు ఇద్దరు అక్కా,చెల్లెల్లు. జ్వరమొచ్చినా.. పండగకు వెళ్లినా.. ఇంట్లో శుభకార్యం జరిగినా.. ఒక్కరోజైనా పాఠశాలకు సెలవు తీసుకుంటారు. కానీ ఇద్దరు విద్యార్థినులను మాత్రం 2024-25 విద్యా సంవత్సరంలో ఈ నెల19వ తేదీ వరకు బడికి ఒక్క రోజు సెలవు తీసుకోకుండా ప్రతీ విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తున్నారు నర్మెట మండలం మాన్ సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న అక్కా చెల్లెల్లు రితిక(3వ తరగతి), పార్వతి (4వ తరగతి)లు.

విద్యార్థినులకు సత్కారం

విద్యార్థినులు చదువపై ఇష్టంతో ఏడాదిలో ఇప్పటి వరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూనే.. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ నంబర్-1గా నిలుస్తున్నారు. విద్యార్థినులు రితిక, పార్వతి. అందరి విదార్థులకంటే ఈ ఇద్దరు విద్యార్థినులు చదువు పట్ల భిన్నంగా బడికి హాజరవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో స్కూల్‌కు ఒక్కరోజు ఆబ్సెంట్ కాకుండా హాజరు కావడం రాష్ట్ర చరిత్రలో అరుదైన రికార్డుగా విద్యాశాఖ అధికారులు భావిస్తోంది. ఇద్దరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి బడికి హాజరవుతూ.. కష్టపడి చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా, ఈ మేరకు ఇద్దరు అక్కా చెల్లెల్లను ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు.



అక్కా చెల్లెళ్లను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్‌సీసీతో బహుళ ప్రయోజనాలు

దేవరుప్పుల: ఎన్‌సీసీతో విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందుతారని మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అన్నారు. శనివారం ఆ పాఠశాలలో ఎన్‌సీసీ సర్టిఫికెట్స్‌లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.. ఎన్‌సీసీలో చేరడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక ధారుడ్యం, దేశభక్తితో పాటు భవిష్యత్‌లో నిర్దేశిత రిజర్వేషన్ కల్పనతో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీలో రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని రాత పరీక్ష, ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు సాధించడంతో అభినందించారు. మొత్తం 23 మంది విద్యార్థులు ట్రైనింగ్ పూర్తి చేసుకోగా ఇందులో 20 మంది విద్యార్థులు ఏ-గ్రేడ్ సర్టిఫికెట్లు పొందగా, ముగ్గురు విద్యార్థులు బి-గ్రేడ్ సర్టిఫికెట్లు పొందారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పదో బెటాలియన్ వరంగల్ అధికారులు హవల్దార్‌లు ప్రవీణ్, మగ్బుల్ భాష, ఎన్‌సీసీ ఇంచార్జీ కృష్ణ, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, మహేష్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులతో జేసురాజు

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల: పురాతన సంస్కృతీ సంప్రదాయ ఉత్సవాలను ప్రజలు పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉప్పల మల్లన్న జాతర ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ ఎల్.లక్ష్మీనారాయణనాయక్‌తో కలిసి పంచముఖ ఆంజనేయస్వామితోపాటు బొడ్రాయి ఉత్సవాల గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకోగా, పూజారి పెద్దాపురం వెంకటేశ్వశర్మ కుటుంబం వారికి ఘనస్వాగతం పలికారు. ఎడ్లబండిపై శివపార్వతుల విగ్రహాలను అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేయించారు. అనంతరం పురవీధుల్లో ఇంటింటా మొక్కులు చెల్లించుకునేందుకు మంగళవాయుద్యాలతో శావను తిప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్ల శ్రీరామ్, యూత్ మండల అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న, గ్రామ అధ్యక్షుడు ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

ఆర్టీసీలో ఘనంగా మర్యాద దినోత్సవం



ప్రయాణికులకు పూలు అందిస్తున్న డీఎం



పోలీసులకు..

జనగామ: ఆర్టీసీలో మర్యాద దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పూలు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జనగామ డిపో మేనేజర్ స్వాతి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు, ట్రాఫిక్ సూపర్ వైజర్లు ప్రయాణికులు, పోలీసులకు పువ్వులతో పాటు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన కీ చైన్‌లను అందించి ముచ్చటించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులే ఆస్తి, వారి గౌరవానికి ఎలాంటి భంగం కలుగకుండా ఉండాలని మేనేజర్ స్వాతి ఉద్యోగులకు సూచించారు. అంతకు ముందు క్యూ ఆర్ కోడ్‌తో ముద్రించిన కీ చైన్‌ను ఆవిష్కరించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

దేవరుప్పుల : ఈ నెల 21వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో బృందావన్ గార్డెన్‌లో ఎర్రబెల్లి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు నవీన్‌నాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ట్రస్టు పక్షాన బబ్బూరి శ్రీకాంత్ సారథ్యంలో వస్తున్న వంద కంపెనీల ఉద్యోగ సదవకాశాలను విద్యావంతులు వినియోగించుకోవాలన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



జనగామ: పట్టణంలో శనివారం కేఎం జాన్ ఆదేశాల మేరకు రన్‌ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. పట్టణంతో పాటు మండల పాస్టర్లు, యూత్, అన్ని సంఘాల పెద్దలు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఇంటింటికి ఆహ్వానం అందించాలి

లింగాలఘణపురం: ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జనాలను తరలించేందుకు ఇంటింటికి ఆహ్వానం అందించాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని కుందారంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభ జరుగనున్న ఎల్కతుర్తి.. నియోజకవర్గానికి దగ్గరగా ఉండడంతో భారీగా తరలి రావాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, నాయకులు శేఖర్, మహిళ నాయకురాలు భాగ్యలక్ష్మి, యాకయ్య తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

కొడకండ్ల: ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాములు కోరారు. శనివారం లక్ష్మక్కపల్లి, పెద్దబాయితండ, రామన్నగూడెం, మొండ్రాయి, గిర్నితండ, మైదంచెరువుతండా, సీఎం తండల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ గ్రామ పార్టీల సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామం నుండి రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 21న ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మోగా జాబ్‌మేళాను యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో అభిమన్‌గాంధీ, సోమరాములు, వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, సతీష్‌గౌడ్, కృష్ణమూర్తి, రమేష్, మంగ్యానాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లా, రాజయ్యపై విమర్శలు చేస్తే సహించం

- బీఆర్‌ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మెప్పు పొందడం కోసం అతని తొత్తులు, ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యపై విమర్శలు చేస్తున్నారని, విమర్శలు పునరావృతమైతే సహించేది లేదని జెడ్పీస్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ హెచ్చరించారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్లా, ఘన్‌పూర్ రాజయ్యను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు మారదోజు రాంబాబు, శిరీష్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పల్లా చుట్టూ, రాజయ్య చుట్టూ తిరుగుతూ కడియంను విమర్శించిన రాంబాబు ప్రస్తుతం పల్లాను, రాజయ్యను విమర్శించడం సిగ్గుచేటన్నారు. నాయకులు కీర్తి వెంకటేశ్వర్లు, బొడ్డు ప్రభుదాస్, వై.కుమార్‌గౌడ్, పి.జైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, తాటికొండ సురేష్, ఆకుల కుమార్, కనకం గణేష్, సోమిరెడ్డి, కమలేష్, చల్లా చందర్‌రెడ్డి, మారెపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

న్యూస్ నెట్‌వర్క్: పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు అన్నారు. శనివారం పలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవంలో భాగం ఈసీఈడే, సామూహిక అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులు, తల్లులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్, మెడికల్ కాలేజీ హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి వారికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కోరారు. ఈ మేరకు శనివారం మెడికల్ కాలేజి హాస్టల్ వర్కర్లతో కలిసి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు ఏనుగుల రఘు, గండి అజయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

- సీపీఐఎంఎల్ లిబరేషన్ కేంద్రకమిటీ సభ్యుడు మూర్తి

పాలకుర్తి: బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలని, ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తోందని సీపీఐఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు మూర్తి అన్నారు. శనివారం పాలకుర్తిలో జిల్లా కార్యదర్శి సాంబరాజు యాదగిరి అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రొయ్యల రాజు, అక్కినపల్లి యాదగిరి, రమేష్, అనంతోజు రజిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్‌డే

రఘునాథపల్లి: బాంజీపేటలో శనివారం స్కూల్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ చెరుకు మహేశ్వరి మాట్లాడుతూ మూడేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీలో అభ్యాసమే కాకుండా ఆటలు, పాటలు, కథలతో వారి మేథస్సును పెంచుతున్నామన్నారు. చిన్నారుల జీవితంలో అంగన్‌వాడీ కేంద్రంలో పొందే విద్య ఎంతో విలువైందన్నారు. అయా కె సుగుణ, గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బండనాగారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం హేమరాణి అన్నారు. శనివారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు.

నిబద్ధతతో పని చేస్తేనే గుర్తింపు

బచ్చన్నపేట: ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని జిల్లా అభివృద్ధి అధికారి విక్రమ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పని చేసిన వార్డన్ రేగొండ నరేందర్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నరేందర్ దంపతులకు శాలువాలతో పలువురు సన్మానించారు.

అన్యమత ప్రచారం అడ్డగింత

చిల్పూరు: మండల కేంద్రంలో శనివారం అన్యమత ప్రచారం చేస్తుండగా బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు దామెర వంశి మాట్లాడుతూ బుగులు వేంకటేశ్వర స్వామికి నిలయంగా ఉన్న మండల కేంద్రంలో అన్యమత ప్రచారాలు చేయడం సమంజసం కాదని అన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ ఏపీఎం కదారి కుమారస్వామి అన్నారు. డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు.

సేవ ద్వారానే గుర్తింపు



బచ్చన్నపేట: ప్రజలకు సేవ చేయడం ద్వారా ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ గోపీనాయక్ అన్నారు. శనివారం వరంగల్‌కు బదిలీ అయిన బ్రాంచ్ మేనేజర్ శివశంకర్‌కు వీడ్కోలు, వరంగల్ నుంచి వచ్చిన గోపీనాయక్‌లకు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని పూలమాలు, శాలువాలతో సత్కరించారు.

పన్నులు వసూలు చేయాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో అన్ని రకాల పన్నులను జీపీ కార్యదర్శులు వసూలు చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్‌ను అధిక సంఖ్యలో వినియోగించుకునేలా చూడాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

దేవరుప్పుల: ఈ నెల 21వ తేదీన సికింద్రాబాద్ జీఎంహెచ్‌సీ ఫంక్షన్‌హాల్‌లో తలపెట్టిన ఉద్యమకారుల ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ విభాగం ఫోరం జిల్లా రాష్ట్ర కార్యదర్శి =రమేష్‌గౌడ్, జిల్లా కన్వీనర్ మొలుగూరి యాకయ్య కోరారు. ఈ మేరకు శనివారం ధర్మాపురంలో ఠాణునాయక్ స్మారక స్తూపం వద్ద వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లింగాలఘణపురం: జనగామ-సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు ఆటో డ్రైవర్లకు గాయాలయ్యాయి. వీరిలో యాదాద్రి భువనగిరి జిల్లా అనంతారంకు చెందిన వసీం, సూర్యాపేట జిల్లా ధర్మారానికి చెందిన నగేశ్‌లు ఉన్నారు. నగేశ్ సూర్యాపేట జిల్లా నుంచి జనగామకు ఆటోలో వస్తుండగా వసీం జనగామ నుంచి అనంతారం వెళ్తుండగా నెల్లుట్ల బ్రిడ్జిపై రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని గాయాల పాలయ్యారు. ఆటోల్లో ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో ఇద్దరు డ్రైవర్లకు గాయాలు కాగా జనగామ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లికి చెందిన చెవుల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా పాంనూర్‌కు చెందిన పోలెపల్లి సంపత్‌రెడ్డిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్యయాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాదం గట్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో యాదగిరి, సంపత్‌రెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, రైతుల భూ సంబంధిత సమస్యల్ని పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

వార కల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో స్వామివారికి వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులకు బండ్లపల్లికి చెందిన లకావత్ వెంకన్న-అంజలిలు అన్న ప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నెల్లుట్ల జానకి అన్నారు. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కమ్మరిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొండ శ్రీనివాస్ చేసిన మాట్లాడే బొమ్మలు ఎంతగానో అలరించాయి.

చలివేంద్రాల ఏర్పాటు

రఘునాథపల్లి: మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ మోహిస్సేన్‌ముజ్జబ ప్రారంభించారు.అనిల్‌కుమార్, ఉపేందర్ ఉన్నారు.

గోపాల్‌నగర్‌లో..

బచ్చన్నపేట: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అన్నారు. గోపాల్‌నగర్ గ్రామంలోని గుడిసెల కేంద్రం వద్ద కొల్లూరి సాయమ్మ-యాదగిరి దంపతులు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి టౌన్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సిహెచ్ శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కంప్యూటర్ సెంటర్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన బత్తిని సాయమ్మ (80) నెల్లుట్ల చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు సాయమ్మను దూషించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సాయమ్మ కనిపించడంలేదని ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ జరుపుతున్న నేపథ్యంలో శనివారం నెల్లుట్ల చెరువులో శవమై తేలింది. ఎవరేమన్నా మాట పడని మనస్తత్వం కలిగిన సాయమ్మను కుటుంబ సభ్యులు మందలించగా మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.